క్లుప్తంగా

జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థి ఎస్.శ్రీకాంత్ గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సోమవారం అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ విద్యార్థి స్మృతిగా యూనివర్సిటీ క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించిన శ్రీకాంత్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను వీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టళ్ల పరిశీలన

చదువుల కోసం తల్లిదండ్రులకు దూరంగా యూనివర్సిటీ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులను సొంత బిడ్డల మాదిరిగా చూసుకుంటే ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని సిబ్బందికి వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సూచించారు. క్యాంపస్‌లోని బాలుర, బాలికల హాస్టళ్లను సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఉన్న వసతులు, ఆహారాన్ని పరిశీలించారు. ఆమె వెంట రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, చీఫ్ వార్డెన్ ఆచార్య డి.జ్యోతిర్మయి తదితరులు ఉన్నారు.

గౌడ సంఘం డివిజన్ అధ్యక్షుడిగా శివాజీ

పెదపూడి: గౌడ సంఘం అనపర్తి డివిజన్ అధ్యక్షుడిగా జి.మామిడాడ గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ పూర్వపు అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు భీమన ఛత్రపతి శివాజీ ఎంపికయ్యారు. ఈ వివరాలను ఆయన సోమవారం విలేకరులకు తెలిపారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 23న తూర్పుగోదావరి జిల్లా గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా మార్గాని సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మార్గాని ఆదినారాయణ, మారిశెట్టి వీర వెంకట సత్యనారాయణను ఎన్నుకున్నారు. అలాగే అనపర్తి డివిజన్ అధ్యక్షుడిగా శివాజీ ఎంపికయ్యారు. కాగా.. శివాజీ ఎంపికపై లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ మండ రాజారెడ్డి, క్లబ్ అధ్యక్షుడు కె.శ్రీను, ప్రతినిధులు సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, డీఆర్‌కే రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

సీతానగరం: రఘుదేవపురం లంకల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.9,250 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

8న లోక్ అదాలత్



వంశీ కృష్ణ, న్యాయమూర్తి

పెదపూడి: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వంశీ కృష్ణ తెలిపారు. ఆయన అనపర్తిలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మార్చి 8వ తేదీన లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. అనపర్తి పరిధిలోని సివిల్, రాజీ చేయగలిగే క్రిమినల్ కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని సూచించారు.

సీఐ మానవత్వం

మధురపూడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని సీఐ సత్య కిశోర్ తన వాహనంలో హాస్పిటల్‌కు తరలించి, సకాలంలో వైద్యం అందేలా చేశారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం మండలానికి చెందిన కాకర్ల అప్పన్న మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరానికి పనికెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎయిర్ పోర్టు సమీపంలో మోటార్ సైకిల్ జారిపోయి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయాలపాలైన అప్పన్నను తన వాహనంలో గోకవరం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. దీంతో బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా.. ప్రమాదం జరిగిన సమయంలో అప్పన్న తలకు హెల్మెట్ ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.

వైభవంగా కల్యాణం

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి వద్ద కొలువైన బాల త్రిపుర సుందరి సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రమణ శర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సత్తి నాగిరెడ్డి, సుశీల దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకట రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి పూజలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వ్రత పూజలు జరిగాయి.

జ్ఞానజ్యోతి.. భవితకు పునాది

- అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ
- ప్రీ ప్రైమరీ చిన్నారులకు మెరుగైన బోధన



జ్ఞానజ్యోతి శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా మహిళా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పీడీ విజయకుమారి



రంగంపేట హైస్కూల్లో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు

రంగంపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్త రూపు సంతరించుకోబోతున్నాయి. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయసున్న చిన్నారులకు ఆటపాటలతో చదువులు అందించేలా జ్ఞాన జ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలను కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది. ఇందులో నేర్చుకున్న అంశాలను తరగతుల్లో బోధించడం వల్ల చిన్నారుల జీవితాల్లో వెలుగులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్ బీ, పడాయి బీ పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దానికి అనుగుణంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖాధికారులు పటిష్ట కార్యాచరణను రూపొందిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పునాది

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయసు చాలా కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకుని, మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్‌ఈపీలో ఈ వయసు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0–6 సంవత్సరాల వయసున్న పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్తుకు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులు పెంపొందించడంతో పాటు ప్రతి కేంద్రానికి ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

మాతా, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, సర్వశిక్ష అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాంలో భాగంగా రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనపర్తి మండలంలో 64 మంది, బిక్కవోలులో 67 మంది, రంగంపేటలో 46 మంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. దీని వల్ల అనపర్తి మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న 1,651 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 652 మంది చిన్నారులు, బిక్కవోలు మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న 1,628 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 870 మంది చిన్నారులు, రంగంపేట మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు 1,766 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 597 మంది చిన్నారులు ప్రయోజనం పొందనున్నారు.

శిక్షణ లక్ష్యం

పిల్లల బాల్యారంభ సంరక్షణ, అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యం. శారీరక, సామాజిక భావోద్వేగం, నైతికత, మేధాభివృద్ధి, భాష – అక్షరాస్యత, సౌందర్య – సాంస్కృతిక అభివృద్ధి అనే ఐదు అంశాల ప్రమాణికంగా చిన్నారుల భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా 120 రోజులు శిక్షణ ఇస్తారు.

మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు

అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు అందిస్తారు. మూడేళ్ల వ్యవధిలో ఏడాదికి 40 రోజుల చొప్పున మొత్తం 120 రోజులు శిక్షణ అందిస్తారు. తొలిదశలో 20 రోజులు, మలి దశలో 20 రోజుల చొప్పున కొనసాగుతున్న ఈ శిక్షణను హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు. అంటే ఆరు రోజుల పాటు ఆఫ్‌లైన్, 14 రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయి. విద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన ఆరుగురు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నారు.

సులభతర బోధనకు శిక్షణ



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యా బోధన జరుగుతోంది. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాథమిక విద్యను 1, 2 తరగతుల చిన్నారులకు సులభతరంగా బోధించుటకు జ్ఞాన జ్యోతి శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.

– జె.జెస్సీఫ్లోరెన్స్, సీడీపీఓ, రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు

ఎంతో ఉపయోగం



చిన్నారుల చదువులకు తొలి అడుగులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడి నుంచే పాఠశాలలకు వస్తారు. అందువల్ల ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎన్‌వీ రమణాంజలి, ఐసీడీఎస్ సూపర్ వైజర్, రంగంపేట

పక్కాగా తరగతులు



జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లపై దృష్టి సారించాం. వివిధ ప్రోగ్రామ్‌లలో భాగంగా ఇప్పటికే 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తున్నాం. ఇందులో మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– కె.శ్రీనివాసరావు, ఎంఈఓ, రంగంపేట మండలం

శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన పురాతన శివాలయాలు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు



బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి



కొంకుదురులోని బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి

బిక్కవోలు: మహాశివరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలు, పరిసరాలను విద్యుత్ దీపాలంకరణలు, భారీ సెట్టింగ్‌లతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శివరాత్రి రోజు బుధవారం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రి భక్తుల సౌకర్యార్థం సాంస్కృతిక, సంప్రదాయ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన శివరాత్రి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు మహిళలు తెల్లవారుజామునే గోదావరి నదిలో పుణ్యస్నానాలు అచరించి శివాలయాల్లో పూజలు నిర్వహిస్తుంటారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు గోలింగేశ్వరస్వామి, ఊలపల్లి రోడ్డులోని కేదారేశ్వరస్వామి, కొంకుదురు బుడతల మామిడి వద్ద ఉన్న త్రిముఖ లింగేశ్వశరస్వామి, పందలపాకలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, గౌరీశంకరులు, ఉమా రామలింగేశ్వర స్వామి, పార్వతీ పరమేశ్వరులు ఆలయాలతో పాటు ఊలపల్లిలోని అగస్త్యేశ్వరస్వామి, తొస్సిపూడి, బలభద్రపురం, కొమరిపాలెం, బలభద్రపురం, ఇలపల్లి, రంగాపురం తదితర గ్రామాలలో జరుగుతాయి.

రంగంపేట మండలంలో..

ముకుందవరంలోని భద్రకాళీ సమేత విశ్వేశ్వర స్వామి, వడిశలేరులోని కాశీ విశ్వేశ్వరస్వామి, రంగంపేటలోని ఉమా రామాలింగేశ్వరస్వామి, జి.దొంతమూరులోని భాస్కరలింగేశ్వరస్వామి, సుభద్రంపేటలోని రాజరాజేశ్వరస్వామి, చంద్రేడులోని కాత్యాయినీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో నెల రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

పెదపూడి మండలంలో..

జి.మామిడాడ శివారు ఎల్ఎన్ పురంలోని భీమేశ్వర స్వామి, పెదపూడిలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి, దోమాడలోని ఉమా మాండేశ్వర స్వామి, పుట్టకొండలోని భద్రకాళీ సమేత వీరభద్రశ్వేర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

అనపర్తి మండలంలో..

అనపర్తిలో పురాతన ఉమా రామలింగేశ్వర స్వామి, కొప్పవరంలోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, మహేంద్రవాడలోని బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి, పాలమూరులోని ఉమా రామలింగేశ్వరస్వామి, దుప్పలపూడిలోని పార్వతి సమేత చంద్రశేఖర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



పెదపూడిలో అధికారులతో మాట్లాడుతున్న సెక్టోరియల్ ఆఫీసర్ మణిదీప్

పెదపూడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్సీ ఎన్నికల మండల సెక్టోరియల్ ఆఫీసర్ టీవీఆర్ మణిదీప్ తెలిపారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను ఆయన సోమవారం పరిశీలించారు. మణిదీప్ మాట్లాడుతూ పెదపూడిలో రెండు, జి.మామిడాడలో ఒకటి మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పెదపూడిలోని 138 పోలింగ్ బూత్‌లో 846 మంది, 139వ బూత్‌లో 993 మంది, జి.మామిడాడలోని 140వ బూత్‌లో 656 మంది మొత్తం 2,485 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతాయన్నారు. దీనికి సంబంధించి వెబ్ క్యాస్టింగ్ కెమెరాలు ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. కాకినాడలోని మెక్లారిన్ హైస్కూల్ నుంచి ఈ నెల 26న ఎన్నికల సామగ్రి తీసుకొస్తారన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఇతరులను అనుమతించకుండా ఏర్పాట్లు చేశారన్నారు. రూట్ ఆఫీసర్‌గా జి.మామిడాడ సచివాలయం కార్యదర్శి ఎస్. కనక నాగేంద్ర కుమార్ వ్యవరిస్తారన్నారు.

వంగలపూడి రేవులో నడక మార్గం పరిశీలన



వంగలపూడి రేవులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా వంగలపూడిలో గోదావరి రేవు వద్ద చేస్తున్న ఏర్పాట్లను ఎస్పీ నరసింహ కిశోర్, నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్య కిశోర్ సోమవారం పరిశీలించారు. గోదావరి పాయపై ఏర్పాటు చేసిన నడక మార్గాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సైకిల్ స్టాండ్, తాగునీరు, అన్నదానం, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్న ప్రదేశాలను పరిశీలించారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, ఉత్సవ కమిటీ సభ్యులు కొంచ భాస్కరరావు, మట్ట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తి నష్టం



జ్యోతి హోటల్‌లో ఎగసిపడుతున్న మంటలు



హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి మెయిన్ రోడ్డులోని జ్యోతి హోటల్‌లో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. వంట మాస్టర్ గ్యాస్ పొయ్యి వెలిగిస్తుండగా ఒక్కసారి మంటలు రేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటీన సంఘటనా స్థలానికి వచ్చి, మంటలను అదుపు చేశారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కాగా.. ప్రమాదంలో సుమారు రూ.రూ.2.50 లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

జ్యోతి హోటల్ నిర్వాహకులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్, పార్టీ నాయకులు ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

రంగంపేట: శారీరక, మానసిక ప్రశాంతతకు ధ్యానం ఎంతో అవసరమని శ్రీకృష్ణపట్నం హార్ట్ ఫుల్ నెస్ కేంద్ర ప్రచారక్ ఇ. రాంబాబు సూచించారు. మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ వి.పార్థసారథి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఐదో రోజు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చిన్నారులకు మానసిక బలహీనతలు తగ్గాలంటే ధ్యాన సాధన చేయించాలన్నారు. సామాజిక భాషాభివృద్ధి, పాఠశాల సంసిద్ధత మేలా నిర్వహించి, గ్రాడ్యుయేషన్ డే ఏవిధంగా చేయాలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ పీఓ జెస్సీఫ్లోరెన్స్, డీఆర్‌పీలు ఎన్‌వీ రమణాంజలి, వి.త్రిమూర్తిరాజు వివరించారు.

సీతానగరంలో..

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కోర్సు కో ఆర్డినేటర్, ఎంఈవో కె.స్వామినాయక్ పర్యవేక్షణలో డీఆర్పీలు కేఎల్ మనోహర్, బేగం, వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు వరలక్ష్మి, భారతి తదితరులు ఐదోరోజు సోమవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణాలు



సీతానగరంలో ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీతానగరం: స్థానిక శివాలయంలో ఉమా రామలింగేశ్వరస్వామివారి కల్యాణాన్ని సోమవారం రాత్రి 7 గంటలకు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కూచిమంచి రాము ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే ముగ్గళ్లలో ఉమా కొమరేశ్వరస్వామి, మునికూడలిలో ఉమా సోమేశ్వరస్వామి కల్యాణాలు వైభవోపేతగా జరిగాయి.

వైభవంగా అష్టాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన



అష్టాదశ జ్యోతిర్లింగాలకు పూజలు చేస్తున్న అర్చకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని మహా మృత్యుంజయ విగ్రహం వద్ద అష్టాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠా కార్యక్రమం సోమవారం అత్యంతం వైభవంగా నిర్వహించారు. ఏటిగట్టు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గల మహామృత్యుంజయ సప్తరుషి సమేత శివాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. అర్చకుడు యనమండ్ర సాయి ఆధ్వర్యంలో, భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు.

డిగ్రీ విద్యార్థులకు మగ్గం వర్కులో శిక్షణ

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా డిగ్రీ విద్యార్థులకు కూడా మగ్గం వర్కులో ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రారంభించిన ఈ కార్యక్రమానికి 60 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. శిక్షణకు హాజరైన వారికి అవసరమై మెటీరియల్‌ని కూడా అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, ఉమెన్ ఎంపవర్మెంట్ శ్రీలక్ష్మి పర్యవేక్షణలో అల్లంపల్లి రూప ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరుగుతుందన్నారు.

గంజాయి వాడకంతో అనేక అనర్థాలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్య కిశోర్ తదితరులు

సీతానగరం: గంజాయి వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు సోమవారం వంగలపూడిలో సీఐ వై.సత్యకిశోర్, ఎస్సై డి.రామ్ కుమార్‌తో కలిసి యువకులు, స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎవరైనా గంజాయిని విక్రయించినా, రవాణా చేసినా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందజేయాలన్నారు. మాదక ద్రవ్యాల వాడకంతో యువత పక్కదారి పట్టి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు.

టీబీ రహిత గ్రామంగా రామవరం



ర్యాలీ చేస్తున్న టీబీ వెరిఫికేషన్ బృంద సభ్యులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరం టీబీ రహిత గ్రామంగా సిల్వర్ మెడల్‌కు ఎంపికైందని స్థానిక ప్రాథమిక వైద్యాధికారి సుమతీదేవి తెలిపారు. ఆ గ్రామంలో సోమవారం టీబీ వెరిఫికేషన్ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ వెరిఫికేషన్ బృందం పర్యటించిందన్నారు. ఈ గ్రామం 2023లో బ్రాంచ్, 2024లో సిల్వర్ మెడల్‌కు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కుతుకులూరు, కొంకుదురు పీహెచ్‌సీల వైద్యాధికారులు దుర్గా ప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దివ్యాంగుల సర్వే



ముకుందవరంలో సర్వే చేస్తున్న బృందం

రంగంపేట: దివ్యాంగుల యోగ క్షేమాలపై నిర్వహిస్తున్న సర్వే సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు టీమ్ సభ్యులు మండల పరిధిలోని ముకుందవరం గ్రామంలో ఇంటింటా సర్వే చేశారు. దివ్యాంగుల యోగ క్షేమాలు, వారికి అందుతున్న వైద్యం, ప్రభుత్వ పథకాలు, సదరన్ సర్టిఫికెట్లు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటిని ప్రోత్సహించిన వారికి విధించే శిక్షలను తెలిపారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది మడికి రాంబాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 104 మంది దివ్యాంగులను గుర్తించామని, సర్వేలో నమోదు చేసుకున్న వివరాలతో కూడిన నివేదికను కోర్టుకు సమర్పిస్తామన్నారు.